
# చినమాయను పెనుమాయ

వీరపల్లె వీణావాణి






"నర్సింగ్ హోంలో మా అమ్మాయి ప్రసవించింది సార్" దీనంగా అన్నాడు సోమయాజులు.

"నర్సింగ్‌హోంలో గాకుండా మీ అమ్మాయి నా యింట్లో ప్రసవిస్తుందా ఏమిటి?"

సోమయాజుల మీద తను వేసిన జోక్‌కి తానే విరగబడి నవ్వేసాడు సిద్ధార్థుడు. ఆ మాటతో సోమయాజుల ముఖం అచ్చం కందగడ్డలా ఎర్రగా మారిపోయింది.

అవసరం అనేది అవహేళనకి రియాక్ట్ కానివ్వకుండా ఆత్మగౌరవాన్ని అణిచి పెడుతుంది.

"అదికాదు సార్! మా అమ్మాయిని ఎల్లుండి డిశ్చార్జి చేస్తారు. నేను... హాస్పిటల్ బిల్ కట్టాలి."

వింటున్నాడు సిద్ధార్థుడు..

"పైగా కాలేజీ కుర్రాళ్లంతా టూర్ వెళ్తున్నారు. మా అబ్బాయి ఫ్రెండ్సంతా పోతున్నారట. అందుకని మావాడు కూడా...."

"వెళ్లాలంటున్నాడా?"

తలాడించాడు సోమయాజులు.

"సో.... వాట్? అవన్నీ నా ముందు ఎందుకని ఏడుపు ముఖంతో యిప్పుడు ఏకరువు పెడుతున్నట్టు?"

"అదే సార్! నా పెన్షన్ ఎరియర్స్ తాలూకూ బిల్స్ మీ టేబుల్ మీదే ఆగిపోయాయి. వాటిని మీరు కాస్త కదిలిస్తే....."

"మూన్నాళ్ల నుంచి పాడుతున్న పాత పాటే కదా?" చీత్కారంగా చూశాడు సిద్ధార్థుడు.

తల దించుకున్నాడు సోమయాజులు.

ట్రెజరీ కార్యాలయం ఆవరణంలో చెట్టునీడన నిలబడి వాళ్లు మాట్లాడుకుంటున్నారు.

ఒకరిది అవసరం కోసం ఆరాటం... యింకొకరిది ఆ అవసరాన్ని కరెన్సీగా మార్చుకునే ప్రయత్నం.

"సార్! నా ఆర్థిక పరిస్థితి గురించి మీకు తెలియదు. కేవలం పెన్షన్‌తో... అదీ ఒక దారపు పోగులాంటి పెన్షన్‌తో ఒంటెద్దుబండిలాంటి సంసారాన్ని లాక్కుంటూ అవస్థలు పడుతున్న అతి సామాన్యమైన మనిషిని. అయిదొందలు ఎక్కడి నుండ తెచ్చి మీకివ్వగలను?" అన్నాడు నిస్పృహయంగా సోమయాజులు.

"చూడండి! మీ కంటే ఎక్కువగా ఓవర్ యాక్షన్ చేసినవాళ్లని ఈ ఆఫీస్ ఆవరణంలో నేను చాలా మందిని చూశాను. అయిదువేలు అరియర్స్‌ని పుచ్చుకోవడానికి ముందుకు వచ్చే చేతులు... అయిదొందలు ముడుపు చెల్లించడానికి మాత్రం వెనక్కి తగ్గి ముడుచుకు పోతాయా?" అడిగాడు సిద్ధార్థుడు.

"అదికాదు సార్!"

"వద్దు. అర్థింపులూ, ఆవేదనలూ వద్దు."

క్షణం ఆలోచించాడు సోమయాజులు.

"సరే. మీకు అయిదువందలేగా కావాలి?"

"ఏం అంతకంటే ఎక్కువిస్తారా?"

"యిస్తాను సార్! ఆరువందలిస్తాను. మీరు నా బిల్స్‌ని కదిలిస్తే... రేపు బ్యాంకులో డబ్బును డ్రా చేసుకున్న మరుక్షణం మీ దగ్గరికి వచ్చి... మీ ఆరొందలు మీకు...."

సోమయాజుల నోట్లోని మాట నోట్లోనే వుండగా పకపక మంటూ నవ్వేశాడు సిద్ధార్థుడు.

చూడండి! నా చెవుల్లో చామంతి చెట్లు లాంటివేం మొలకెత్తలేదు. మీరు బడిపంతులుగా పనిచేస్తే చెయ్యొచ్చు. అంతే గానీ.... మూడో క్లాసబ్బాయికి చెప్పినట్టు... ముచ్చటగా కథలు మాత్రం.

> అంతర్జాతీయ ఖ్యాతి నార్జించుకొన్న తెలుగు కథ ఈనాడు వ్యాపార విలువలకు బలైపోతున్నదని, మంచి కథలకు కొరత ఏర్పడుతున్నదని కథకులు, కథా వేదికల వారూ గొడవ పెట్టేస్తున్నారు. నిజమే కావచ్చు కానీ, కథకులు ఆర్థిక ప్రలోభాలకు, అర్థంలేని ప్రచారకాంక్షకు అమ్ముడుపోకుండా తమ నిజాయితీని నిలుపుకుంటూ సమాజం పట్ల ఆర్తితో, అవగాహనతో రాసే కథకుల కథలకు 'ఆహ్వానం' పలికే పత్రికలు లేకపోలేదనే విషయం ముందు గుర్తించి, ఇటువంటి పత్రికలకు తమ సహకారం అందించటం ద్వారా తమ వంతు బాధ్యతను నిర్వర్తించమని కోరుతున్నాం.
>
> —ఎడిటర్

చెప్పకండి. అదేదో ఆవు తన దూడకి పాలిచ్చి తిరిగి వచ్చి ఆహారం అవుతానని పులిని ప్రాధేయపడిన కథ మీకు గుర్తుకొచ్చిందేమో..."

"లేదు సార్! నా మాట నమ్మండి."

"మీ అమ్మాయికి పెళ్లి చేశారు కదా. కట్నం తాలూకూ డబ్బును మీ అల్లుడికి ఎప్పుడిచ్చారు? మీ అమ్మాయి మెడలో తాళి బొట్టు కట్టడానికి ముందే యిచ్చారా? లేక తాళిబొట్టు కట్టేసిన తర్వాత నింపాదిగా యిచ్చారా?" అడిగాడు సిద్ధార్థుడు.

"తాళి కట్టకముందే."

"చూశారా? వియ్యంకుల మధ్యే విశ్వాసాలు ఏర్పడనప్పుడు... అయినవాళ్ల నడుమే అపనమ్మకాలున్నప్పుడు... ఎవరో తెలియని మిమ్మల్ని నేను నమ్మడం ఎంత అన్‌నాచురల్?"

"లేదు సార్! నేను అలాంటి వాడిని కాను. నా మీద సానుభూతి చూపించండి" అంటూ సోమయాజులెంతో ప్రాధేయపడ్డాడు. సిద్ధార్థుడి చేతుల్ని పట్టుకున్నాడు. కన్నీళ్లు పెట్టుకున్నాడు. అయినా ప్రయోజనం లేకపోయింది. లేడి కన్నీటికి వేటగాడి గుండెని కరిగించే శక్తి వుండదు.

చూడ్డానికి చిన్నవాడిలా కన్పించినా.... సిద్ధార్థుడికి ముప్ఫయ్ అయిదేళ్లుంటాయి. 'సిద్ధార్థుడు అని అతనికి నామకరణం చెయ్యడంలోనే ఓ సింబాలిజం వుంది. అసలు సిద్ధార్థుని జననమే... జనాన్ని ఏడిపించే సిల్వర్‌జూబ్లీ సినిమా సబ్జెక్ట్‌లాంటిదని కొంత మందికి మాత్రమే తెలుసు.

మూడున్నర దశాబ్దం క్రితం... ముమ్మరంగా ఓరోజు తుఫాన్ వచ్చిందట. సరిగ్గా అప్పుడే సీతమ్మకి కూడా పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయట. కాన్వార్ చెప్పుల్లో డూప్లికేట్స్ వున్నట్టే... కాన్పప్పుడు వచ్చే నొప్పుల్లోనూ కొన్ని డూప్లికేట్ నొప్పులుంటాయని రఘు రామయ్యకి ఓ మంత్రసాని చెప్పిందట.

అంచేత... ఆయన తన భార్య పడే పురిటి నొప్పుల్ని పట్టించుకోలేదట. ఓ అర గంట తర్వాత అవి ఒరిజినల్ నొప్పులేనని గ్రహించిన రఘురామయ్య... హడావుడిగా సీతమ్మని ఓ రిక్షాలో తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రికి ప్రయాణమయ్యాడట. ఉధృతంగా గాలి వీచడంతో దార్లోనే రిక్షా ఉల్టాగా పడిపోయిందట.

వెంటనే రఘురామయ్య ఆ రిక్షావాడి సాయంతో తన భార్యను పక్కనే వున్న పార్కులోని చెట్టు కిందికి చేర్చాడట. సరిగ్గా ఆక్షణంలోనే పెనుగాలికి చెట్టుకొమ్మ విరిగి సీతమ్మ మీద పడడం, ఆమె కెవ్వుమనడం... ఆమె పొట్టలోంచి సిద్ధార్థుడు కూడా కెవ్వుమని ఏడుస్తూ బయటకు రావడం...

మరుక్షణమే సీతమ్మ మరో లోకానికి వెళ్లిపోవడం... అన్నీ చకచకా జరిగిపోయాయట. భార్య వియోగానికి పాపం రఘురామయ్య బావురమంటూ ఏడ్చినా.... ఆ తర్వాత ఆయన ఎంతో సంతోషించాడట. ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ కాకుండా కనీసం బిడ్డనైనా దక్కించుకున్నందుకు.

తన విషాద జననం గురించి వీరాస్వామితాతయ్య వివరించి చెప్పినప్పుడు... ఎంత సినిమాటిక్‌గా జరిగిపోయింది నా జననం!!

> 'సిద్ధార్థుడు' అని అతనికి నామకరణం చెయ్యడంలోనే ఓ సింబాలిజం వుంది. అసలు సిద్ధార్థుని జననమే... జనాన్ని ఏడిపించే సిల్వర్ జూబ్లీ సినిమా సబ్జెక్ట్‌లాంటిదని కొంత మందికి మాత్రమే తెలుసు.

అంటూ సిద్ధార్థుడు వండరైపోయాడు.

రఘు రామయ్య తన కొడుక్కి 'సిద్ధార్థుడు' అని యిష్టంకొద్దీ ఈ పేరు పెట్టడంలో యిత ఫ్లాష్‌బ్యాక్ దాగుందని చాలామందికి తెలియదు. పదేళ్లప్రాయంలో సిద్ధార్థుడు ఒకనాడు పక్కవీధిలో వెళ్తుండగా ఫుట్‌పాత్ మీద పడుకుని ఓ దుప్పటి కప్పుకొని 'కచిక్ కచిక్' మంటూ కర్ణకఠోరంగా దగ్గుతూ మూలుగుతున్న ఓ రోగగ్రస్తుడు అతని కంటపడ్డాడు.

ఆ దృశ్యాన్ని చూసిన సిద్ధార్థుడు హఠాత్తుగా ఆగిపోయి... ఆ రోగి వేపే కన్నార్పకుండా చూసి... మెల్లగా సమీపించి దయనీయమైన ఆ జీవుని అవస్థకు హృదయం ద్రవించగా అంత చిన్న వయస్సులోనే పెద్ద నిట్టూర్పు విడిచాడు సిద్ధార్థుడు. అయితే యిదేమీ అంత చెప్పుకోతగ్గ విషయం కాదు.

కానీ.... అటూ యిటూ చూసి... ఆ రోగి ఒంటిమీదున్న ఆ దుప్పటిని చెప్పాపెట్టకుండా తృటికాలంలో లాక్కుని తుర్రుమంటూ పారిపోయి సెకండ్ హాండ్ బట్టలమ్మేవాడికి దాన్ని అర్థరూపాయికి చ్చేసి... ఆ డబ్బుల్తో సిద్ధార్థుడు బఠాణీలు కొనుక్కుని తిన్న విషయం మాత్రం ఎంతైనా చెప్పుకోదగింది.

సదరు సిద్ధార్థుడు యిప్పుడు ట్రెజరీ ఆఫీస్‌లో ఓ మాదిరి ఉద్యోగమే చేస్తున్నాడు. సాధారణంగా ఆఫీస్‌లో అతని చేతులు టేబుల్ కింద తప్ప.... టేబుల్ మీద కన్పించవని ఓ ప్రతీతి. యింట్లో డైనింగ్ టేబుల్ దగ్గర కూడా మంచినీళ్ల గ్లాస్‌కోసం అతని చేయి టేబుల్ కిందికే వెళ్లిపోతూ వుంటుంది.

లంచాన్నీ, జీతాన్నీ రక్తమాంసాల్లా కలిపేసి భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధిస్తున్న లంచేశ్వరజాతికి సంబంధించిన కొంతమందిలో పేర్కొనదగినవాడు సిద్ధార్థుడు.

అసలు... లంచం జీతం అని వేర్వేరుగా వుండవని, నిజానికి అవిరెండూ ఒకటేనని, విజ్ఞుడైన వాడు ఏకదృష్టితోనే వాటిని చూస్తాడని వాదించే 'విశిష్టాద్వైతం' అతనిది.

డబ్బుల్ని అలవోగ్గా మింగెయ్యడమనేది సిద్ధార్థునికి చిన్నప్పుడే అవలడిన అరవై అయిదో కళ. మూడేళ్ల ప్రాయంలోనే.... కంటపడ్డ పదిపైసల బిళ్లల్నీ, పావలాబిళ్లల్నీ సునాయాసంగా మింగేసి... గాబరాపడిపోతూ గగ్గోలు పెడ్తున్న గ్రాండ్‌మదర్ని చూసి గలగల నవ్వేసిన ఘనుడు సిద్ధా

ర్థుడు.

'పువ్వు పుట్టగనే పరిమళిస్తుంది' అంటూ తన ముద్దుల మనవడి సాహసాన్ని చూసి గర్వంగా ఫీలైపోతూ సిద్ధార్థుని గురించి పదిమందితోనూ చెబుతుండేది ఆ గ్రాండ్‌మదర్.

పరాయివాడి సొమ్ముతో టిఫిన్ తిని, పరాయివాడి సొమ్ముతో కాఫీతాగి, పరాయి సొమ్ముతో కొనుక్కున్న కింగ్‌సైజ్ ఫిల్టర్ గోల్డ్ సిగరెట్ని విలాసంగా కాలుస్తూ ఆఫీస్ క్యాంటీన్లో ఓ మూల కూర్చుని వున్నాడు సిద్ధార్థుడు.

"గురూజీ!" అంటూ అప్పుడే క్యాంటీన్లోకి అడుగు పెట్టిన గురుమూర్తి సిద్ధార్థుని సమీపించాడు.

"ఏమిటి మూర్తీ?"

"శుభవార్త గురూజీ!"

"చెప్పు."

"మనూళ్లోని ఎయిడెడ్ డిగ్రీకాలేజ్ లెక్చరర్ల యు.జి.సి ఎరియర్స్ తాలూకూ బిల్లులొచ్చాయి."

"ఈజిట్?" సిద్ధార్థుని ముఖం హండ్రెడ్ క్యాండిల్ బల్బులా హఠాత్తుగా వెలిగిపోయింది.

"నిజం గురూజీ!"

"మొత్తం ఎరియర్స్ ఎంత?"

"రెండు లక్షలా యాభైవేలు"

"మరి... పర్సెంటేజ్ విషయం చెప్పావా?"

"అయిదుశాతం అడిగాను. కానీ...."

ప్రశ్నార్థకంగా చూశాడు సిద్ధార్థుడు.

"ఓన్లీ వన్ పర్సెంట్ యిస్తారట."

"ఎవడిక్కావాలి బోడి వన్ పర్సెంటూ?"

సిద్ధార్థునికి బోడి వన్ పర్సెంట్లు నచ్చవు. బొచ్చు ఫైవ్ పర్సెంట్లు మాత్రమే నచ్చుతాయి. సిగరెట్ పీకని కింద పడేశాడు సిద్ధార్థుడు.

"పర్సెంటేజ్ విషయం నీతో మాట్లాడాలని కాలేజ్ ప్రిన్స్‌పాల్ వచ్చాడు. ఆయనకి నువ్ ఓల్డ్ స్టూడెంట్‌వటగా?"

"ఏడీ ప్రిన్సిపాల్?"

"అడిగో" క్యాంటిన్ కిటికీలోంచి చేత్తో దూరంగా చూపెట్టాడు గురుమూర్తి.

తల తిప్పి చూశాడు సిద్ధార్థుడు.

పద్నాలుగేళ్ల క్రితం... ఏ కాలేజీలోనైతే సిద్ధార్థుడు బి.ఏ చదివాడో అదే ఎయిడెడ్ డిగ్రీకాలేజీ ప్రిన్సిపాల్...

పద్నాలుగేళ్ల క్రితం... ఫేర్‌వెల్ ఫంక్షన్‌లో ఎథిక్స్ గురించీ, నైతిక విలువల గురించి ఏకధాటిగా తోటి విద్యార్థులకి సిద్ధార్థుడిచ్చిన సందేశాత్మక ఉపన్యాసానికి ముగ్ధుడై... ఏ ప్రిన్సిపాలైతే కరతాళ ధ్వనులు మ్రోగించాడో అదే కళాశాల ప్రిన్సిపాల్...

పద్నాలుగేళ్ల క్రితం... చదువు ముగించి సిద్ధార్థుడు ఆ కాలేజ్ నుండి వెళ్లిపోయేటప్పుడు... ఏ ప్రిన్సిపాలైతే అతనికి గుడ్ కాండక్ట్ సర్టిఫికేట్‌ని స్వహస్తాలతో రాసి సంతకం చేసి యిచ్చాడో అదే ప్రిన్సిపాల్...

యిప్పుడు తమ స్టాఫ్‌కి వచ్చిన ఎరియర్స్ బిల్స్‌ను పాస్ చేయించే నిమిత్తం... యిచ్చుకోవాల్సిన లంచం శాతం గురించి సిద్ధార్థునితో మాట్లాడ్డం కోసం ఆ ట్రెజరీ కార్యాలయం వరండాలో అటూ యిటూ తచ్చాడుతున్నాడు.

"మూర్తీ! నువ్వొక పనిచెయ్యి."

"చెప్పు గురూజీ."

"ఆఫీస్‌లో అంతా బిజీగా వున్నారని... ఓ గంట తర్వాత రమ్మని ఆ ప్రిన్సిపాల్‌కి చెప్పి పంపించేయ్. ఈలోగా నేను మన ఆఫీసర్ని కలిసి పర్సెంటేజ్ ఫిక్స్ చేయిస్తాను."

"కానీ గురూజీ! మీరు ఫిక్స్ చేసిన పర్సెంటేజ్ వాళ్లు యివ్వకపోతే?" అనుమానంగా అన్నాడు గురుమూర్తి.

"బిల్స్‌లో తప్పులున్నాయని కొర్రిపెట్టి రిజెక్ట్ చేస్తాను. యింతకీ యివాళ తేదీ ఎంత?"

"మార్చి ముప్పయ్."

"రేపు ముప్పయ్ ఒకటి. రేపటిలోగా బిల్స్ పాసై బ్యాంక్‌లో క్రెడిట్ కాకపోతే... తర్వాత సీన్ ఏమిటో ఆ లెక్చరర్లకి బాగా తెలుసు. అంచేత మనం ఫిక్స్ చేసిన పర్సెంటేజ్ యిచ్చి తీరతారు."

"అంతేనంటావా?"

"అంతే మరి. దెయ్యానికి మంత్రం. దేవుడికైతే ముడుపు. దిగిరావాల్సిందే మరి." నవ్వేశాడు సిద్ధార్థుడు.

"వస్తా గురూజీ!" అంటూ ఆ క్యాంటీన్‌లోంచి బయటపడిన గురుమూర్తి ప్రిన్స్‌పాల్ దగ్గరికెళ్లి సిద్ధార్థుడు చెప్పమన్నట్లే చెప్పి ఆయన్ని పంపించేశాడు.

రెండు రోజుల్లో.... ఫైనాన్షియల్ యియర్ ముగియబోతూవుంది. అందుకే ట్రెజరీ కార్యాలయ ఆవరణం జనంతో కిటకిటలాడిపోతూవుంది. అక్కడి అందరిదీ ఒకే సమస్య.

ఆ సీజన్‌లో మాత్రం ఆ కార్యాలయం లోని ఉద్యోగస్తుల జేబులూ, వ్యానిటీ బ్యాగులూ బ్రహ్మోత్సవాల టైంలోని తిరుమలేశుని హుండీతో పోటీ పడుతుంటాయి.

"సర్!" ఆ పిలుపుతో ఆఫీస్‌లోకి వెళ్లబోతున్న సిద్ధార్థుడు చటుక్కున ఆగి తల తిప్పి చూశాడు.

ఏపుగా పెరిగిన వేపచెట్టు కింద నిలబడి సిద్ధార్థుని వేపు దీనంగా చూశాడు సోమయాజులు.

"సార్!..."

"చెప్పొద్దు. నర్సింగ్‌హోంలో మీ అమ్మాయి ప్రసవించింది. ఈ పాత ట్యూనే కదా మీరు ఆన్ చెయ్యబోయేది?"

"అదికాదు సార్!"

"చూడండీ! యిచ్చిన డబ్బుల్ని కూడా లెక్కపెట్టుకునే టైమైనా లేనంత బిజీ నేను."

"నే చెప్పేది కొంచెం వినండి సార్!"

* * *

**లంచాన్నీ, జీతాన్నీ రక్తమాంసాల్లా కలిపేసి భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధిస్తున్న లంచేశ్వర జాతికి సంబంధించిన కొంతమందిలో పేర్కొన్నదగినవాడు సిద్ధార్థుడు.**

* * *

'ఆహ్వానం' ప్రచురించే విలువైన క్రొత్తకథల విశ్లేషణలో పాఠకుల్ని, రచయితల్ని పాల్గొనవలసిందిగా కోరుతున్నాం. తమ అభిప్రాయం సంక్షిప్తంగా, సమీక్షాత్మకంగా రాసి పంపితే ఎన్నిక చేసిన వాటిని ప్రచురించటమే గాక 50రూ. పారితోషికం కూడ పంపుతాం. —ఎడిటర్

"చెప్పడానికి మీరేం హరికథ దాసు కాదు. వినడానికి నేనేం శ్రోతను అంతకంటే కాను. ఏమంటారు?' '

"అఫ్‌కోర్స్"

"అఫ్‌కోర్స్గా యింజనీరింగు కోర్సులిప్పుడు ఎందుగ్గానీ... అడిగిన అయిదొందల సంగతేం చేశారు?' '

"తెచ్చానండి."

టి.వీలో హైదరాబాద్ ఛానల్లో సూపర్ ప్రోగ్రామేదో కళ్లబడినట్టు ఉలిక్కిపడ్డాడు సిద్ధార్థుడు.

"యిదిగోనండి" అంటూ జేబులో చేయి పెట్టి కాగితాల్ని పైకి తీయబోయాడు సోమయాజులు.

"ఆగండాగండి. యిది కొంచెం డేంజరస్ సీజన్. మీకు మా యిల్లు తెల్సుకదా?" అడిగాడు సిద్ధార్థుడు.

తలాడించాడు సోమయాజులు.

"నేను భోజనానికి మధ్యాహ్నం యింటికి వెళ్తాను. మీరు ఒకటిన్నరకు మా యింటికి రండి."

"మరి... నా ఎరియర్స్ బిల్లులు..."

"వాటి పని చూసే యింటికొస్తాను"

"సరే సార్!" అంటూ కాళ్లీడ్చుకుంటూ ఆ ఆఫీస్ ఆవరణం లోంచి బయటపడ్డాడు సోమయాజులు.

మధ్యాహ్నం ఒకటిన్నరైంది.

కాలింగ్‌బెల్ నొక్కాడు సోమయాజులు.

"రండి" తలుపు తెర్చి ఆహ్వానించాడు సిద్ధార్థుడు.

యిద్దరూ ఎదురెదురుగా కుర్చీలలో కూర్చున్నారు. జేబులో చేయిపెట్టి అయిదు నోట్లు తీశాడు సోమయాజులు.

"ఈ పనేదో నాలుగురోజుల క్రితమే చేసుంటే మీ బిల్స్ పాసైపోయేది కదండీ."

సోమయాజులు మాట్లాడలేదు.

"యింతకీ మీ అబ్బాయి నిన్న తన ఫ్రెండ్స్‌తోటి టూర్ వెళ్లాడా?" అడిగాడు సిద్ధార్థుడు.

"లేదు సార్! వాడిక ఎక్కడికీ వెళ్లలేడు" సోమయాజుల కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి.

సిద్ధార్థుని కనుబొమలు ముడిపడ్డాయి.

"డబ్బులేదని ఎంత చెప్పినా వినకుండా వాడు నానా గొడవ చేశాడు. నేను యిరిటేటై వాడిని చితకగొట్టాను. అసలే ఆవేశపరుడు. అవమానం భరించలేక... తొందరపడ... ఆత్మహత్య చేసుకోవాలని రైలు కింద పడ్డాడు."

షాక్ తిన్నట్టు చూశాడు సిద్ధార్థుడు.

"చనిపోయాడా?"

"లేదు. రెండు కాళ్లూ తెగిపోయాయి..." అంటూ సిద్ధార్థుని చేతికి డబ్బులందించాడు సోమయాజులు.

"అరెరె..." సానుభూతిని ప్రకటించి తలదించుకొని నోట్ల సంఖ్యను లెక్క పెడుతున్నాడు సిద్ధార్థుడు

సరిగ్గా అదే క్షణంలో... రెండు బలమైన చేతులు సిద్ధార్థుని చేతుల మీద పడడం... నోట్లు టాలీ చెయ్యడం... మెదలైన తతంగం మొత్తం జరిగిపోయింది.

తను అవినీతి నిరోధక శాఖవారి వలలో తగులుకున్న విషయం... గ్రహించగానే... అపాదమస్తకం కంపించి పోయాడతడు. చెమటతో బట్టలు ముద్దగా తడిసిపోయాయి.

సోమయాజుల వేపు చూసి "యిది న్యాయం అధర్మం" అంటూ అరిచాడు సిద్ధార్థుడు.

"ఒరేయ్! ఏది అన్యాయమో, ఏది అధర్మమో మనిషికి గుర్తు రావలసింది తను దెబ్బ తిన్నప్పుడు కాదురా. యింకొకర్ని దెబ్బ కొట్టేటప్పుడు.... అప్పుడు గుర్తు రావాలి. నా బిడ్డ కాళ్లు తెగ వికలాంగుడయ్యాడంటే... కారణం నువ్వురా... నువ్వు. నీలాంటి నీచుడికి, నేరస్తుడికి శిక్ష పడాలి. ఉద్యోగం ఊడాలి. రోడ్ల మీద పడాలి" అంటూ సోమయాజులు కడుపు మండి శాపాలు పెట్టాడు.

కానీ... సిద్ధార్థునికి ఉద్యోగం ఊడనూ లేదు రోడ్ల మీద పడనూలేదు. కారణం... అవినీతి నిరోధక శాఖవారికి అందవలసిన ముడుపును అందించాడు సిద్ధార్థుడు. చట్టం కంటే చట్టంలోని లొసుగులే.... నేరస్తుల్ని కాపాడడానికి ఎక్కువ ఉపయోగపడ్తున్నాయి. సోమయాజులు కొడుకు 'ధర్మతేజ' యివాళ అవిటివాడు. ○

